# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JUNE - 2000

# రేడియో శ్రీలంక ద్వారా
# క్రీస్తు సంఘముల సువార్త ప్రసార కార్యక్రమములు

తెలుగు : **సత్యవాణి**
ప్రతి ఆది, మంగళ, బుధ, గురు వారాల్లో
మధ్యాహ్నం 2-00 గం॥ల నుండి 2-15 వరకు.
ప్రసంగీకులు : **జాషువా గూటం, కాకినాడ.**

హిందీ : **సత్య సుసమాచార్**
ప్రతి ఆదివారం రాత్రి 8-45 నుండి 9--00 వరకు,
ప్రతి గురువారం రాత్రి 9-00 నుండి 9-15 వరకు.
ప్రసంగీకులు : **సన్నీడేవిడ్, న్యూఢిల్లీ.**

తమిళం : **సత్యవాజి**
ప్రతి ఆదివారం సాయంత్రం 6-45 నుండి 7-00 వరకు,
మంగళవారం, శుక్రవారం సాయంత్రం 5-30 నుండి 5-45 వరకు
గురువారం సాయంత్రం 5-45 నుండి 6-00 వరకు.
ప్రసంగీకులు : **పి.ఆర్. స్వామి, బెంగుళూరు.**

మళయాళం : **ది వోయిస్ ఆఫ్ ట్రూత్**
ప్రతి శుక్రవారం సాయంత్రం 3-45 నుండి 4-00 వరకు.
ప్రసంగీకులు : **పి.కె. వర్గీస్, తిరువనంతపురం.**

కన్నడ : **The Voice of truth**
ప్రతి ఆదివారం మధ్యాహ్నం 1-45 నుండి 2-00 వరకు.
ప్రసంగీకులు : **రోబర్ట్ రత్నాకర్, బెంగుళూరు.**

ఇంగ్లీషు : **The Voice of truth**
ప్రతి శుక్రవారం సాయంత్రం 7-45 నుండి 8-00 వరకు.
ప్రసంగీకులు : **జె.సి. ఛోట్, అమెరికా.**

పై కార్యక్రమములను అందరు వినండి. అందరికీ విన్పించండి.
ఉచిత బేసిక్ బైబిల్ కోర్సులోని పాఠముల కొరకు ఈరోజే మాకు వ్రాయండి.

**SATYA VAKKU**
P.O. BOX 80, KAKINADA - 533 001. Phone : 0884 - 363722

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 20 జూన్ 2000 సంచిక 11


## మంచి హృదయాలు చెడు హృదయాలు
### ( Good and Bad Hearts )

మంచి చెడు హృదయాలను గూర్చి తలంచునప్పుడు మనం సాధారణంగా భౌతిక గుండెను గూర్చి ఆలోచిస్తాము. మనకు వయస్సు పెరిగే కొలది శరీరంలోని ఈ అవయవాన్ని గూర్చి ఎక్కువ ఆలోచిస్తాము. హృదయాన్ని గూర్చి, రకరకాల హృదయాలను గూర్చి లేఖనములలో ఎక్కువ కనబడతాది. గాని అది రక్తప్రసరణ గావించే గుండె గాక మానవుని మనస్సు, యోచన పద్ధతిని గూర్చి చెబుతుంది. మానవుని హృదయం అంటే అతని మానసిక తత్వం, మనోభావాలని మనం సాధారణంగా ఉద్దేశించి మాట్లాడుతాము.

ఒకని ఆత్మీయ పరిస్థితితో సంబంధములేకయే యున్న మంచి హృదయములున్నవి. మానవులు ఆయా సంగతులను గూర్చి కలిగియున్న

స్వభావాన్ని బట్టి వారి హృదయం మంచిదనో లేక చెడ్డదనో మనం భావిస్తాము. ఒక వ్యక్తి మంచితనము, దయ, విశాల భావములు గలిగి నిష్కపటుడై సరియైన దానిని జరిగించాలని ప్రయత్నించుచుంటే అతనిది మంచి హృదయమని మనం చెబుతాము. కొందరు అసహ్యులు, పొరుగువారితో కలసిమెలసి యుండరు. ఎల్లప్పుడు ఏదో ఒకటి సణుగుకొనుచునే యుంటారు. అట్టి వారిది చెడు హృదయం అని మనం తలస్తాము.

నా హృదయం ఎట్టిది ? యని మనం ప్రశ్నించుకొంటే మంచిది. ఈ విషయంలో మనకు సహాయకరంగా యుండునట్లు లేఖనాల్లో చెప్పబడిన కొన్ని హృదయాలను మనం పరిశీలించుదాం :

**1.** పవిత్ర హృదయాలు : "హృదయశుద్ధి గలవారు ధన్యులు గలవారు ధన్యులు; వారు దేవుని చూచెదరు" అని క్రీస్తు చెప్పారు (మత్త 5:8). "మీరు క్షయ బీజమునుండి కాక శాశ్వతమగు జీవముగల దేవుని వాక్య మూలముగా అక్షయ బీజమునుండి పుట్టింపబడిన వారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్ర పరచు కొనినవారై యుండి యొకనినొకడు హృదయపూర్వకముగాను మిక్కుటము గాను ప్రేమించుడి" యని పేతురు చెప్పాడు (1పేతురు 1:22,23). ఈ వచనములను బట్టి ఒకడు ప్రభువుకు విధేయుడగుట ద్వారా అతని హృదయం పవిత్ర పరచబడునని, పవిత్ర హృదయం కలిగియుండుట వలన దేవుని చూడ గలమని, లేదా ఆయనతో యుండగలమని తెలిసికొనగలము.

**2.** కఠిన హృదయం : ఇట్టి హృదయం కలిగిన వానికి ఏమీ చెప్పలేము. అట్టివాడు మొండివాడు, ఏమి చెప్పినా వినడు, ఆలోచించడు, దయ చూపించడు. మోషే ధర్మశాస్త్ర కాలములో జీవించుచు కఠిన హృదయాలు కలిగిన వారిని గూర్చి, అంటే తమ యిష్ట మొచ్చినట్లు ప్రవర్తించే వారిని గూర్చి క్రీస్తు చెప్పారు. నేడు

కూడ ఒకడు తాననుసరిస్తున్న భక్తి మార్గాన్ని (సంఘాన్ని) గూర్చి దేవుని వాక్యంలో ఎక్కడా కనుగొనకపోయినను, కుటుంబ సభ్యులను గూర్చి లేక మరేదైనా కారణాన్ని గూర్చి అదే మార్గాన్ని అవలంభిస్తూ మార్పునొందడానికి ఇష్టపడకపోతుంటే అతడు కఠిన హృదయుడని మనం చెప్పుకోవచ్చు. ఒకడు తన హృదయాన్ని గట్టిపరచుకొని తన పొరబాటులోనే జీవిస్తూయుంటే అది చాలా ప్రమాదకరం. అట్టివాడు మార్పుచెందుట చాలా కష్టము. "పాపము వలన కలుగు భ్రమచేత మీలో ఎవడును కఠినపరచబడకుండునట్లు - నేడు అనబడు సమయముండగనే ప్రతి దినమును ఒకనినొకడు బుద్ధి చెప్పుకొనుడి" యని హెబ్రీ పత్రిక లేఖకుడు హెచ్చరించాడు (హెబ్రీ 3:13).

**3. విశ్వాసం లేని హృదయాలు :** "సహోదరులారా, జీవము గల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసము లేని దుష్ట హృదయము మీలో ఎవనియందైనను ఒకవేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి" యని దైవప్రేరిత లేఖకుడు చెప్పాడు (హెబ్రీ 3:12). అవిశ్వాసము నాశనానికి నడుపుతాది. "నమ్మనివానికి శిక్ష విధింపబడునని" క్రీస్తు చెప్పారు (మార్కు 16:16). అయితే వినుట వలన విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:17). నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును (రోమా 10:10). ఐతియోపియా నపుంసకుడు హృదయపూర్వకముగా విశ్వసించిన యెడల క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవచ్చునని ఫిలిప్పు చెప్పాడు (అపొ.కా. 8:37). అతడు తన విశ్వాసాన్ని ఒప్పుకొనగా ఫిలిప్పు అతనికి బాప్తిస్మమిచ్చాడు.

**4. మార్పు పొందని హృదయం :** పౌలు ఇట్లు చెప్పాడు : "నీ కాఠిన్యమును మార్పు పొందని నీ హృదయమును అనుసరించి ఉగ్రత దినమందు, అనగా దేవుని న్యాయమైన తీర్పు బయలుపరచబడు దినమందు నీకు నీవే ఉగ్రతను సమకూర్చుకొనుచున్నావు" (రోమా 2:5). "లోపలనుండి అనగా మనుష్యుల హృదయములో నుండి దురాలోచనలును జారత్వమును దొంగతనములును

4.
నరహత్యలును వ్యభిచారములును లోభములును చెడుతనములును కృత్రిమమును కామవికారమును మత్సరమును దేవదూషణయు అహంభావమును అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలినుండియే బయలు వెళ్ళి మనుష్యుని అపవిత్రపరచునని" క్రీస్తు చెప్పారు (మార్కు 7:21-23). అందువలననే మానవుడు మారుమనస్సు పొందాలని లేకపోతే నశిస్తాడని ప్రభువు ఆజ్ఞాపించారు (లూకా 13:3). మారుమనస్సు పొందినవారు పాపక్షమాపణ నిమిత్తం ప్రభువుకు విధేయత చూపే స్థితిలో యుంటారు (అపొ.కా. 2:38). మారుమనస్సు పొందనొల్లని వారు నశిస్తారు.

5. ఏక హృదయులు : దేవునికి విధేయులైన వారందరు ఏక హృదయులు అవుతారు. వారు ఒకే ఆజ్ఞలకు లోబడుట వలన ఏకము చేయబడ్డారు. వారు క్రీస్తునందు, ఆయన సంఘమునందు ఏకము చేయబడుట వలన ఒండొరులకు సహాయపడుట కిష్టపడుదురు (అపొ.కా. 4:32). యిది ఏకత్వము. లేఖనముల ద్వారా కలిగిన ఐక్యత (యోహాను 17; 1కొరింథీ 1:10).

6. అంధ హృదయం : ఎఫెసులో యున్న క్రైస్తవులు అన్యజనులవలె నడుచు కొనరాదని పౌలు చెప్పాడు. "వారైతే అంధమైన మనస్సు గలవారై తమ హృదయ కాఠిన్యము వలన తమలోనున్న అజ్ఞానము చేత దేవుని వలన కలుగు జీవములో నుండి వేరుపరచబడినవారై తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచు కొనుచున్నారు. వారు సిగ్గులేనివారై యుండి నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు తమ్మును తామే కాముకత్వమునకు అప్పగించుకొనిరి" (ఎఫెసీ 4:18,19). మోసపర్చబడిన హృదయం దీనితో సమానమైనది. యాకోబు ఇట్లను చున్నాడు : "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచు కొనుచు భక్తిగలవాడనని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే" (యాకోబు 1:26).

**7. విధేయత గల హృదయం :** మనము హృదయపూర్వకముగా ఆయనకు లోబడాలని ప్రభువు కోరుచున్నారు (రోమా 6:17,18). మనం పూర్ణ హృదయము**తో** ఆయనను ప్రేమించాలి (మత్తయి 22:36,37). పౌలు ఇట్లు హెచ్చరించాడు : "మనుష్యులను సంతోష పెట్టువారు చేయునట్లు కంటికి కనబడుటకే కాక క్రీస్తు దాసులమని యెరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు మనుష్యులకు చేసినట్టు కాక ప్రభువునకు చేసినట్టే యిష్టపూర్వకముగా చేయుడి... మీలో ప్రతివాడును ఏ సత్కార్యము చేయునో దాని ఫలము ప్రభువు వలన పొందునని మీరెరుగుదురు" (ఎఫెసీ 6:6-8).

ఇంతేగాక లేఖనాల్లో అనేక హృదయాలు వర్ణించబడినవి. అవి ఏమని పిలువ బడినను ఆలోచించేవి అవే; ఏదైనా పనిచేయుటకు లేక చేయకుండుటకు, విధేయత చూపుటకు లేక చూపకుండుటకు, ఆరాధించుటకు లేదా ఆరాధించకుండుటకు, సేవించుటకు లేదా సేవింపకుండుటకు పురికొల్పేవి అవే యని మనం గమనించాలి. అవి అంగీకరిస్తాయి, నిరాకరిస్తాయి, మంచివి, చెడ్డవి, నీతిగలవి, నీతిలేనివి మొదలగునవి. ఒకనికున్న హృదయాన్ని బట్టి అతడు రక్షింపబడునో లేక నశించునో నిర్ణయించబడతాది.

నీకున్నహృదయం ఎట్టిది ?అది విశాల హృదయమా ? దయార్ద్ర హృదయమా ? కదలించబడేదా ? వినేదా ? అది నిష్కపటమైనదా ? ప్రేమించునదా ? దయగల హృదయమా ? నీకుండవలసిన హృదయాన్ని నీవే నిర్ణయించుకోగలవని గుర్తుంచుకో. అదొక అవిశ్వాస హృదయమైతే దేవుని వాక్యాన్ని అంగీకరించుట ద్వారా దాన్ని విశ్వాస హృదయంగా మార్చుకోవచ్చును. అదొక చెడ్డ హృదయమైతే క్రీస్తు చిత్తానికి లోబడి క్రీస్తు సారూప్యములోనికి మారుచు మంచి హృదయం కాగలదు. నీవు క్రీస్తును నమ్మకంగా అనుసరించిన వాడవని, మంచి హృదయుడవని నిన్ను గూర్చి ప్రజలు చెప్పగలిగితే దానికి మించిన అభినందన ఇంకేమున్నది ?

6.

# ఎందుకు సిగ్గుపడతారు ?

## (Why are you ashamed ?)

ఎవరైనా మీ నాన్న పేరేంటి ? అని అడిగితే ధైర్యముగా చెప్పేస్తారు. మీ ఇంటిపేరు ? అని అడిగితే సంతోషముగా చెప్పేస్తారు. ఈ విషయంలో సిగ్గుపడరు, బాధపడరు. ఏమియు అనుకోరు. ఆత్మీయ విషయాలలో చూస్తే ఎవరైనా మీరు క్రైస్తవులా యని అడిగితే క్రైస్తవులము అని చెప్పుకోవటానికి సిగ్గుపడి వినిపించు కోనట్లు ఏదో కబుర్లు చెప్పేస్తారు.

సినిమా పుస్తకాలు గాని, నవలలు గాని, మరియే యితర పుస్తకాలు గాని తీసుకొని వెళ్లుటకు సిగ్గుపడరు, భయపడరు. గాని జీవ గ్రంథమైన బైబిలును వెంటబెట్టుకొని వెళ్లుటకు సిగ్గుపడతారు, భయపడతారు.

ఎందుకు సిగ్గుపడాలి ? క్రీస్తు ప్రభువు అంటే అంత హీనమైనవాడా ? బైబిలు సినిమా పుస్తకాల కన్నా, నవలల కన్నా హీనమైనదా ? క్రైస్తవులము అన్ని పేరు పెట్టుకొని సిగ్గుపడుచున్న వారు క్రైస్తవులా ? లేక క్రీస్తు విరోధులా ?

క్రీస్తున్ను 30 వెండిరూకలకు ఆశపడి ఇస్కారియోతు యూదా అమ్మివేసాడు. పేతురు కూడా తన ప్రాణమును రక్షించుకొనగోరి, క్రీస్తు ప్రభువు నాకు తెలియదని యూదులతో అబద్ధమాడి క్రీస్తును ఎరుగనన్నాడు (మార్కు 14:30,66,68). మనం కూడా ఈ పనేచేస్తున్నాం గదా ! ఉదరపోషణ కొరకు, స్కాలర్ షిప్‌ల కొరకు ఉద్యోగము కొరకు ఏవేవో పేర్లు పెట్టుకొని కొందరు ఎటు వీలుపడితే అటు మార్చుకొంటారు. ఆ రోజుల్లో క్రీస్తును యూదులు హింసించినారు. ఈ రోజుల్లో క్రైస్తవులు అని వ్యవహరింపబడుతున్న వారు క్రీస్తును సిలువ వేస్తున్నారు. ఎంతటి విషాధకరమైన విషయం !

మత బోధకులే పర్వాలేదని తప్పుడు బోధ చేస్తుంటే, అమాయకులు ఏమి చేస్తారు ?

అందుకే క్రీస్తు ప్రభువు ఇలా అన్నారు : వేషధారులారా పరిసయ్యులారా శాస్త్రులారా మీరు పళ్ళెమును వెలుపట శుద్ధి చేయుదురు గాని, అవి లోపట దోపులోను, అజితేంద్రియములోను నిండి యున్నవి (మత్తయి 23:25). మేము మంచివారము అంటూ స్వంత సిద్ధాంతములను తయారు చేసికొని బోధిస్తున్న వీరిని దేవుడు వేషధారులని పిలుస్తాడా, లేక భళా నమ్మకమైన వాడవని పిలుస్తాడా ? బైబిలుకన్న మీ విశ్వాస ప్రమాణ పుస్తకాలను గౌరవిస్తున్న మిమ్ములను ఏమని పిలుస్తారో మీరే గమనించండి.

మీ సంఘము (Church) పేరేంటి అని మత నాయకులను అడిగితే, మాదండీ-లూథరన్ లేక క్యాథలిక్, పెంతెకొస్తు బాప్టిస్టు అని చెప్పుకోటానికి సిగ్గు పడక ఎంతో ఆనందముగా చెప్పేస్తారు. అసలు బైబిలులో ఈ సంఘాల గురించి ఉందా? ఎందుకండీ బైబిలుకన్నా మానవ సిద్ధాంతాలపైన ఆధారపడి తప్పుడు బోధచేస్తారు? ఎందుకు అబద్ధాలంటే మీకు అంత ఇష్టం ? క్రీస్తుకన్న మానవుడు గొప్పవాడనా మీ ఉద్దేశం ?

నా సంఘమును కట్టుదును అని క్రీస్తు స్పష్టముగా చెబుతుంటే (మత్తయి 16:18) ఎందుకు మీరు ఆ వాక్యాన్ని కొట్టివేస్తారు ? సరేకాని ఈ వచనం ప్రకారం ఎవరి సంఘమని పిలువబడాలి ? మీరే చెప్పండి. ఇది క్రీస్తు సంఘం కాదంటారా? ఎక్కడో ఎందుకు ? రోమా 16:16లో "క్రీస్తు సంఘములు" అని ఉందిగదా. ఎందుకు ఈ విషయమై బాధపడతారు ? అమాయకులైన ప్రజలను ఎందుకు నాశనం చేస్తారు చెప్పండి ? క్రీస్తు సంఘాన్ని స్వరక్తమిచ్చి కొన్నాడు అని ఉంది గదా (అ.కా. 20:28). మరి దీని విషయం అంటే ప్రభువు సంఘం కొరకు రక్తం కార్చలేదంటారా ! ఇంత స్పష్టముగా బైబిలు హెచ్చరిస్తు ఉంటే, ఎందుకు తప్పుడు బోధ చేయాలి ? ఈలాంటివారు క్రీస్తును మరలా సిలువ వేస్తున్నారన్న విషయాన్ని మరచిపోతున్నారు (హెబ్రీ 6:5,6).

రక్షింపబడినవాడు క్రీస్తు నామాన్ని ధరించుకొంటాడు (అ.కా. 11:26). బాప్తిస్మము ద్వారా క్రీస్తును ధరించుకొంటాడు (గలతీ 3:27). క్రీస్తుకు అవయవములై క్రీస్తు శరీరములో, క్రీస్తు సంఘములో క్రీస్తు రాజ్యములో ఉంటాడు (కొలస్స 1:18; కొలస్స 1:13; ప్రకటన 1:9). రక్షింపబడినవాడు మానవకల్పిత సంఘములో ఎలా ఉంటాడు ? వేరే సంఘాలలో ఉంటే అతను రక్షింపబడలేదు. యేసు నామం వలననే గాని వేరే నామం వలన రక్షణ లేదు (అ.కా. 4:12). క్రీస్తు ద్వారా రక్షింపబడినవారు వేరే సంఘంలో ఎందుకు ఉంటారు ? బాప్తిస్మం ముంచడమే గాని చిలకరింపు కుమ్మరింపు కాదు (రోమా 6:1-6). నపుంసకుడు ఫిలిప్పు ఇద్దరు నీళ్ళలోనికి దిగిరి. ఫిలిప్పు నపుంసకునికి బాప్తిస్మమిచ్చెను (అ.కా. 8:38). చిలకరింపుకు నీటిలోనికి దిగవలసిన పనిలేదు గదా ! ఒకడు రక్షింప బడాలంటే, చిలకరింపు కుమ్మరింపు జండా క్రిందగ వెళ్ళుట ద్వారా రక్షింపబడలేడు. బైబిలు అలా బోధించుటలేదు. ఈ విషయాన్ని వింటుంటే ఆశ్చర్యంగా ఉంది. కొందరు బైబిలు చెప్పు బోధ గాక వారి స్వంత సిద్ధాంతాలను బోధిస్తారు.

బైబిలు విషయాలకు కలిపినను తీసివేసినను పరలోకరాజ్యంలో పాలుపంపులు లేవు (ప్రకటన 22:18,19)..

బైబిలు బోధ గాక, వేరే బోధ ఎవరైనను పరలోకమందున్న దూతయైనను ప్రకటించిన శాపగ్రస్తుడు అని గలతీ 1:7,8లో ఉంది. ఎందుకు భయం లేక స్వంత సిద్ధాంతాలు బోధిస్తారు ?

చిన్న పిల్లలకు బాప్తిస్మాలు ఇస్తారు. పాపం కడిగివేసుకొనుటకు బాప్తిస్మం పొందాలి (అ.కా. 22:16 అ.కా. 2:38). వీరు ఏ పాపం చేసారు ? పాపం లేనివానికి పాపం ఉన్నదని బోధించటం ఇంతకంటే అబద్ధం మరేముంది ?

మన మధ్యవర్తి క్రీస్తు (1తిమో 2:5). కాని మానవుడు మధ్యవర్తినని పిలువ బడుచున్నాడు. అసలు వీరు దేవునికంటే గొప్పవారా ?

మానవమాత్రులము గనుక తప్పు చేస్తాం. ఆ తప్పులు మన మధ్యవర్తియైన ప్రభువుకు తెలియచేయమని 1యోహాను 1:9,10లో ఉంది కాని Father అనే గురువులకు చెవిలో చెప్పాలని ఎక్కడా లేదు. ఈ విషయం మహా విడ్డూరంగా ఉంది. క్రీస్తు పేరు పెట్టుకొని తప్పుడు బోధ చేస్తున్నారనిపిస్తుంది.

ప్రియ మిత్రులారా, చిలకరింపు, కుమ్మరింపు, జెండా క్రిందకు వెళ్లిన వారలారా, వాక్యానుసారంగా ముంచటం (బాప్తిస్మము) పొంది, నీ కొరకు నాకొరకు రక్తం కార్చిన వాని సంఘములో అనగా క్రీస్తు సంఘములో జేరండి. మానవుని చెవిలో గాక మీ విన్నపాలు మధ్యవర్తి యైన ప్రభువుకు తెలియజేయండి.

తప్పుడు బోధనుండి బయటకు వచ్చి నిజ సంఘములో జేరండి.

యం. ఫిలిప్,
క్రీస్తుం సంఘం, గుంటూరు.

సంఘచరిత్ర :

# ప్రొటెస్టాంటుల మతశాఖల తత్వము సంస్కరణకు అవరోధమాయెను

## (The Protestant Denominationalism Curbs Reformation)

సత్యావాక్కు యొక్క గత రెండు సంచికలలో సంస్కరణోద్యమము యొక్క కారణములు, దాని మూల సూత్రములను గమనించాము. కేథలిక్కు సంఘము లోని అవినీతి దానికి మూల కారణమాయెనని గ్రహించాము. దానికితోడు ముద్రణ యంత్రము కనుగొనబడుట, భక్తిపరమైన ఉజ్జీవము, మరియు ప్రజలలో మత స్వేచ్ఛను గూర్చిన కాంక్ష ఉద్భవించుట వలన ఈ ఉద్యమము రేకెత్తించబడడానికి సిద్ధముగా యుండెను. మార్టిన్ లూథరు, జ్వింగ్లీ, జాన్ కేల్విన్, మొదలగు వారు

నాయకత్వము వహించుచు ముందుకు వచ్చారు. ఈ ఉద్యమము యూరపు అంతటిలోను ఆశ్చర్యకరంగా ఆయా ప్రాంతములలో మొదలిడెను. అయితే దాని నెదురాడువారు నాడు లేకపోలేదు. కేథలిక్కు సంఘము మొదట్లో విఘాతమునకు లోనైనను, అది త్వరలోనే కోలుకొని తన బలగమును తిరిగి పోగు చేసుకొనెను. తాను కోల్పోయిన భూభాగమును క్రమముగా తిరిగి సంపాదించుకొన మొదలిడెను. అది తన పూర్వపు శక్తిని తిరిగి సంపాదించుకొనినందున వేలకొలది ప్రొటెస్టాంటులు నాశనము గావించబడిరి. అయితే అనేకచోట్ల ప్రొటెస్టాంటులు బలముగా పాతుకుపోయిరి. వారిని తొలగించుట అసాధ్యమాయెను.

అయితే ప్రొటెస్టాంటులలోనే వారి ఉద్యమమునకు అవరోధము కల్పించే శక్తి ఒకటి ఆరంభమాయెను. అది కేథలిక్కుల సంకల్పము వలన కలిగినది కాదు గాని, ప్రొటెస్టాంటుల స్వయంకృతాపరాధమే. అది మతశాఖల తత్వము. మతశాఖల తత్వము (Denominationalism) అనగా మత సంబంధముగా వివిధ గుంపులుగా, శాఖలుగా విడిపోవుట యని అర్థము. తనకు తానే వేరుపడిన ఏ రాజ్యమైనను నిలువనేరదు అను లోకోక్తి ఒకటి కలదు. ఆలాగే కలిసివుంటే నిలబడతాం, విడిపోతే పడిపోతాం అను మరొక లోకోక్తి కూడ కలదు. సంస్కరణోద్యమమును కేథలిక్కులు ఓడించనవుసరం లేదు. అది చేయవలసినదంతా సమయం కొరకు కనిపెట్టుటయే. ఈలోగా ప్రొటెస్టాంటులు శాఖోపశాఖలుగా విడిపోయి పడిపోవుటకు సిద్ధముగా యుండిరి. విడిపోయి పడిపోయిన వారిని ఓడించడం ఏమంత కష్టము కాదు కాదు గదా.

ప్రశ్న యేమంటే, ప్రొటెస్టాంటు ఉద్యమకారులు మతశాఖల రొంపులో చొచ్చుకుపోయి, వారి ప్రయత్నాలను ఎందుకు భంగపరచారు ? ఎందుకు, ఎలా? అనే ప్రశ్నలకు ఈ వ్యాసములో జవాబును కనుగొందాము, గాని మొదట కొన్ని ప్రొటెస్టాంటు మతశాఖల యొక్క క్లుప్త చరిత్రను పొందు పరచుదాం.

# డినామినేషన్ల ఆరంభము

**లూథరన్ సంఘము :** సంస్కరణోద్యమము ఆరంభించబడిన తరువాత ఉద్భవించిన మొదటి డినామినేషన్ లూథరన్ సంఘము. అది మార్టిన్ లూథరు యొక్క నాయకత్వములో క్రీ॥శ॥ 1521లో ప్రారంభించబడెను. 1530వ సంవత్సరము తరువాత దాని సభ్యులందరు ఆగ్స్‌బర్గ్ విశ్వాస ప్రమాణ పుస్తకము (Augsburg Confession of Faith) నకు కట్టుబడి యుండుటకు నిశ్చయించు కొనిరి. లూథరన్ డినామినేషన్ వారు ఈ దిగువ అంశముల యందు విశ్వాస ముంచుదురు :

- విశ్వాసము వలన మాత్రమే రక్షణ.
- డినామినేషన్లన్నియు క్రీస్తు సంఘము యొక్క కొమ్మలు లేక శాఖలు.
- పది యాజ్ఞలు నేటికిని అమలులో యున్నవి. ప్రజలందరు వాటికి బాధ్యులే.
- బాప్తిస్మమిచ్చే విధానములో పట్టింపులు లేవు.
- పసి పిల్లలకు బాప్తిస్మ మియ్యవలెను.
- ప్రభురాత్రి భోజన మూలికలలో నిజముగా క్రీస్తు యొక్క రక్తమాంసము లుండును.

**ఆంగ్లికన్ సంఘము - ఎపిస్కోపల్ సంఘము :**

క్రీస్తు శకము 1535లో హెన్రీVIII అను ఇంగ్లాండు దేశపు చక్రవర్తి తన దేశములోని సంఘమును రోమ్‌లో యున్న సంఘమునుండి విడదీసి ప్రొటెస్టాంటులలో రెండవ డినామినేషన్‌ను స్థాపించెను. ఇంగ్లాండు దేశపు సంఘమునకు శిరస్సుగా హెన్రీVIII చక్రవర్తిని ఆ దేశపు పార్లమెంటు అధికార పూర్వకముగా ప్రకటించెను. కేథలిక్కుల నుండి విడిపోయినను ఈ ఆంగ్లికన్ సంఘము కేథలిక్కుల ఆచార కర్మలను చాల మట్టుకు పాటించుచునే నేటికిని యున్నది.

(తరువాయి 14వ పేజీలో)

| | తేదీ | దేశము | స్థాపకులు | సంఘము యొక్క పేరు |
|---|---|---|---|---|
| 1. | A.D. 33 | యెరూషలేము | క్రీస్తు ప్రభువు | క్రీస్తు సంఘము |
| 2. | A.D. 606 | రోమ్ | బోనిఫేస్ - III | రోమన్ కేథోలిక్ |
| 3. | A.D. 1521 | జర్మనీ | మార్టిన్ లూథర్ | లూథరన్ |
| 4. | A.D. 1535 | ఇంగ్లాండు | హెన్రీ - VIII | ఎపిస్కోపల్ |
| 5. | A.D. 1536 | స్విట్జర్లాండ్ | జాన్ కెల్విన్ | ప్రెస్బిటేరియన్ |
| 6. | A.D. 1550 | ఇంగ్లాండు | రాబర్ట్ బ్రౌన్ | కాంగ్రిగేషనల్ |
| 7. | A.D. 1607 | హాలెండ | జాన్‌స్మిత్ | బాప్టిస్ట్ |
| 8. | A.D. 1739 | ఇంగ్లాండు | జాన్‌వెస్లీ | మెథడిస్టు |
| 9. | A.D. 1826 | ఇంగ్లాండు | జాన్ డ్రర్బర్ | చర్చ్ ఆఫ్ గాడ్ (దేవుని సంఘం) |
| 10. | A.D. 1830 | అమెరికా | విలియం మిల్లర్ | ఎడ్వెంటిస్టు |
| 11. | A.D. 1830 | అమెరికా | జోసఫ్ స్మిత్ | లేటర్ డే సెయింట్స్ (మోర్మన్స్) |
| 12. | A.D. 1844 | అమెరికా | ఎలెన్ జి వైట్ | సెవెంత్‌డే ఎడ్వేంటిస్టు |
| 13. | A.D. 1866 | అమెరికా | మేరీబేకర్ ఎడ్డీ | క్రిస్టియన్ సైంటిస్ట్ |
| 14. | A.D. 1872 | అమెరికా | చార్లెస్ రసెల్ | యెహోవా సాక్షులు |
| 15. | A.D. 1878 | అమెరికా | విలియమ్ బూత్ | రక్షణ సైన్యం |
| 16. | A.D. 1946 | ఇండియా (గుంటూరు జిల్లా) | ముంగాముూరి దేవదాస్ | బైబిల్ మిషన్ |
| 17. | A.D. 1957 | మద్రాస్ | Evangelical, Group of Reformer | యునైటెడ్ క్రీస్తు సంఘము |
| 18. | A.D. 1926 | మద్రాస్ | ప్లిమౌత్ బ్రదరన్ | జి.డి.యం. |
| 19. | A.D. 1933 | మద్రాస్ | ఒక గ్రూపు, ఐసాన్, టోపెకా | పెంతెకోస్తు |
| 20. | A.D. 1938 | హైదరాబాద్ | భక్తసింగ్ | భక్తసింగ్ ఫెలోషిప్ (హెబ్రోను) |
| 21. | A.D. 1938 | మద్రాస్ | డి.జి.ఎస్. దినకరన్ | యేసు పిలుచుచున్నాడు |
| 22. | A.D. 1938 | మద్రాస్ | డన్లస్ | W.M.E. |
| 23. | A.D. 1938 | ----- | పి.యల్. పరంజ్యోతి | మన్నా పెంతెకొస్తు |
| 24. | A.D. 1938 | విజయవాడ | పి.యం. సామ్యూల్ | ఐ.పి.సి. |
| 25. | A.D. 1938 | యు.యస్.ఏ. | బిషప్ మైక్ మోరిమేన్ | అపోస్తలిక్ యేసు నామ సంఘము |

మతశాఖ కానిది, ఏ మానవునిచే స్థాపించబడనిది, క్రీస్తు సంఘము - క్రీస్తు ప్రభువు - *AD 33* - యెరూషలేము

(11వ పేజీ తరువాయి భాగము)

ఈ ఆంగ్లికన్ సంఘము యొక్క మరియొక శాఖ అమెరికాలో వర్జీనియా రాష్ట్రములో ప్రారంభించబడెను, మరియు ఇంగ్లాండు దేశములోని బిషప్పుల ఆధీనములో అది చాల కాలము వరకుండెను. ఆమెరికా దేశమునకు స్వాతంత్ర్యము లభించిన తరువాత అది ఎపిస్కోపల్ సంఘముగా ప్రబలమాయెను. ఎపిస్కోపల్ సంఘము అనగా బిషప్పులచే పాలింపబడు సంఘమని యర్థము. ఆంగ్లికన్ సంఘము యొక్క 39 విశ్వాస ప్రమాణ సూత్రములనే అది పాటించును, వారి ఆరాధన క్రమము అంతయు Book of Common Prayer ప్రకారము జరిగించ బడును.

**ప్రెస్బిటేరియన్ సంఘము :**

జాన్ కేల్విన్ అనునతడు క్రీశ 1536లో ప్రెస్బిటేరియన్ సంఘమును స్థాపించెను. స్కాట్లాండ్‌లో జాన్‌కేల్విన్ యొక్క కృషివలన అది బలముగా పాతుకుపోయెను. పాదిరుల పాలన పద్ధతి వలన అది ప్రెస్బిటేరియన్ సంఘము అని పిలువబడినది. అది దిగువ సంగతులను విశ్వసించి బోధించును :

- ముందు నిర్ణయము (Predestination)
- ఒకని హృదయములో పరిశుద్ధాత్ముడు నేరుగా పనిచేయును.
- పసి పిల్లల బాప్తిస్మము
- విశ్వాసము వలన మాత్రమే రక్షణ
- 1643 సంవత్సరములో తయారు చేయబడిన Westminister Confession of Faith అను ప్రమాణ పుస్తకమును వారనుసరింతురు.

**బాప్టిస్టు సంఘము :**

జాన్ స్మిత్ అనునతడు క్రీస్తు శకము 1603లో హాలేండ్‌లో బాప్టిస్టు సంఘమును

స్థాపించెను. అతడును, అతని అనుచరులును క్రొత్తనిబంధన చదువగా పసిపిల్లల బాప్తిస్మము, చిలకరింపు అనునవి బైబిలు ప్రకారము బాప్తిస్మము కానేరవు అని గ్రహించిరి. బాప్టిస్టు డినామినేషన్‌కు అనా బాప్టిస్టులను వారు పునాది వేసిరి. అనా బాప్టిస్టులు కేథలిక్కులలో నుండి మారిన వారు తిరిగి బాప్తిస్మము పొందవలెనని కోరేవారు. అపొస్తలులు స్థాపించిన సంఘము యొక్క మాదిరి నాశనమైనదని, దానిని మరల అనుసరించాలని జాన్ స్మిత్ విశ్వసించెను.

1611వ సంవత్సరములో ఇంగ్లాండులో తోమస్ హెల్విస్ అనువాని నాయకత్వములో మరియొక గుంపు ఆరంభమాయెను, 1639లో రోజర్ విలియమ్స్ అనునతడు అమెరికాలో ప్రోవిడెన్స్ అను వూరులో, రోడ్ ఐలేండ్‌లో మరియొక సంఘమును మొదలిడెను. నేడు బాప్టిస్టులలోనే 12 రకాల శాఖలున్నవి. బాప్టిస్టులకు ఒక విశ్వాస ప్రమాణ పుస్తకం అంటూ యేమీలేదు గాని వారి విశ్వాసాచరణలు లిఖించబడిన రూల్ పుస్తకములనే (Manuals) అనుసరింతురు. వీటిలో రెండు పుస్తకములు ప్రాముఖ్య మైనవి. అవి The standard Manual for Baptist Churches by Hiscox, మరియు Church Manual Designed for the use of Baptist Churches by Pendelton అనునవి.

బాప్టిస్టులు ఈ దిగువ సిద్ధాంతముల ననుసరింతురు :

- విశ్వాసము వలన మాత్రమే రక్షణ
- విశ్వాస భ్రష్టత్వము అసంభవము
- మార్పుజెందుటలో పరిశుద్ధాత్ముడు నేరుగా పని చేయును
- పరిమితి గలవారికే ప్రభురాత్రి భోజనం (Closed Communion) వగయిరా.

## మెథడిస్టు సంఘము :

మెథడిస్టు డినామినేషన్ జాన్‌వెస్లీ ద్వారా 1739వ సంవత్సరములో స్థాపించబడెను. అతడు ఆంగ్లికన్ సంఘమును సవరించబోయి మెథడిస్టు సంఘమును స్థాపించెను.

ఎపిస్కోపల్ సంఘములో జాన్‌వెస్లీ ఒక గురువుగా పనిచేస్తూ, అదే వృత్తిలో అతడు మరణించినను ఇంకో గుంపును స్థాపించాలనే కాంక్ష గలిగినవాడు కాదు. గాని చివరకు జరిగింది అదే. అతని కృషివలన మెథడిస్టు సంఘము మొదలిడెను.

అమెరికాలో మెథడిస్టు - ఎపిస్కోపల్ సంఘము 1784లో బాల్టిమోర్ కాన్ఫరెన్సు సమయములో స్థాపించబడెను. ఆ కాన్ఫరెన్సులో జాన్‌వెస్లీ తయారుచేసిన Book of Discipline అంగీకరించబడెను. ఎపిస్కోపల్ సంఘము యొక్క Prayer Book లోని 39 నియమములను జాన్‌వెస్లీ 24కు కుదించి, అమెరికాలోని సంఘములకు మరియొక నియమమును అందులో చేర్చెను. ఆంగ్లికన్ సంఘము నేడు తొమ్మిది శాఖలుగా విడిపోయింది. మరియు అమెరికన్ మెథడిస్టులు 15 శాఖలయ్యారు. మెథడిస్టులు దిగువ సంగతులను బోధిస్తారు :

- సంఘము జనరల్ కాన్ఫరెన్స్ ద్వారా పాలించబడ్డాలి. సంఘము ఆ కాన్ఫరెన్సు కంట్రోలులో యుండును.
- విశ్వాసము వలన మాత్రమే రక్షణ (See Article IX of the Methodist Discipline).
- పరిశుద్ధాత్ముడు నేరుగా పనిచేయును.
- బాప్తిస్మము ఏ పద్ధతిలోనైనా ఇయ్యవచ్చును.
- ప్రభురాత్రి భోజనం ఒక సంస్కారము
- క్రీస్తు సంఘమునకు అనేక బ్రాంచీలున్నాయి. అందులో మెథడిస్టు సంఘము ఒకటి.

క్రీ॥శ॥ 1521 నుండి స్థాపించబడిన 5 డినామినేషన్ల క్లుప్త చరిత్రను ఇక్కడ పొందుపరచాం. ఈనాడు 250 కంటే ఎక్కువ డినామినేషన్లున్నాయి. అవి మరల కొన్ని వందల శాఖోపశాఖలయ్యాయి. వాటిలో కొన్నిటి చరిత్ర ఈ సంచికలో సెంటర్ పేజీలలో (12, 13 పేజీలలో) పట్టిక రూపముగా ముద్రించబడినవి.

# ప్రభువు కోరుచున్న కానుకలు
## (The Offerings the Lord Seeks)

కానుకలు ఇచ్చుట ఆరాధనలో ఒక భాగమైయున్నది. పౌలు వ్రాసిన పత్రికలలో కానుకలు ఇచ్చుట యొక్క ప్రాముఖ్యతను సూచించెను: "నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లిన కొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువ చేయవలెను" (1కొరింథీ 16:1-2).

కాబట్టి మనము ఇవ్వవలసిన కానుకలు ఎట్లుండవలెను ? మొదటిగా బైబిలు నందు ఆదాము సంతతి అయిన కయీను, హేబెలు దేవునికి అర్పణములు ఇచ్చుట చూచెదము : "హేబెలు గొఱ్ఱెల కాపరి, కయీను భూమిని సేద్య పరచు వాడు. కొంతకాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణముగా తెచ్చెను. హేబెలు కూడ తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని అర్పణను లక్ష్యపెట్టెను. కయీనును అతని అర్పణను లక్ష్యపెట్టలేదు" (ఆది కా. 4:2-5).

మనలో చాలామంది దేవునికి కానుకలు ఇచ్చుచు మనము ఇచ్చినది దేవునికి ఇష్టముగానున్నది అని అనుకొందుము. కాని కానుకలు ఇచ్చునప్పుడు మనము కొద్దిపాటి నిర్లక్ష్యము చేయుదుము.

మనవద్ద కానుకలు సమర్పించుటకు అతిశ్రేష్టమైనవి ఉన్నను వాటికంటె కొంచెం తక్కువైనవి ఇచ్చుటకు ఇష్టపడెదము ! అలాగు చేయునప్పుడు మనము ఇచ్చే అర్పణము కయీను ఇచ్చిన అర్పణములాంటిదగును. మనలను మనం పరీక్షించుకుందాం. కానుకలు సమర్పించేటప్పుడు డబ్బు రూపమున మనవద్ద కొంచెం పాతవిగా వున్న నోట్లు, క్రొత్తవిగా వున్ననోట్లు, మరి పాతగిలి చినిగిపోయిన నోట్లు వున్నప్పుడు మనం దేవునికి ఏమి సమర్పించు కొందుము ?

మనము **పాత** చినిగిన నోట్లు సమర్పించిన యెడల మనము కయీనును అనుసరించు వారమగుదుము. కాని మనము క్రొత్తవిగా వున్నవి ఇచ్చునప్పుడు మనము హేబెలు ననుసరించు వారమగుదుము అనే సత్యమును మనము గ్రహింపవలెను.

మనలో చాలా మంది కానుకల వద్ద నిర్లక్ష్యవైఖరి కల్గియుందుము. ఉదాహరణకు "ఏమి అవుతుంది, క్రొత్తవి శ్రేష్టమైనవి (best) ఇవ్వకపోతే యేమి కాదులే" అని అనుకొందుము. కాని ఇదే వైఖరి దేవుడు మన యెడల చూపిన యెడల మనము ఇహలోకమందు వుండలేము అని గ్రహింపవచ్చును. "దేవుడు మనలను ఎంతో ప్రేమించెను కాగా తన అద్వితీయ కుమారునిగా పుట్టినవాని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). దేవుడు మన యెడలనున్న ప్రేమను బట్టి ఆయన తన కుమారుని మనకొరకు పంపించెను. ఆయన అటువలె కాక ఆయన దూతలను పంపించవచ్చును కదా ? యేమి, మనము ఆయన సృష్టియే కదా యేమి కాదు గదా అని అనుకొనవచ్చును కాదా ! కాని దేవుడుఅట్లు ప్రవర్తించలేదు. ఆయన చేసిన వాగ్దానము బట్టి క్రీస్తును మన పాపములకు బలిగా అర్పించెను.

అట్లే సణుగుకొనకయు బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను" (2కొరింథీ 9:7). దేవుడు చెప్పిన ప్రకారము మనము చేయుట వలన మనకు యెంతో శ్రేయస్కరము. మనము ఇచ్చు కానుకలు మనము ముందుగా హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. అట్లు ఇయ్యనివారు బైబిలునందు మనకు అపొ.కా. 5:1-6 వరకు కనబడుదురు. అననీయ, సప్పీర అను దంపతులు తమ ఆస్తి అంతటిని అమ్మివేసి ఆ సొమ్మును అపొస్తలులులకు సమర్పించు కొనవలెనని నిశ్చయించుకొనిరి. కాని ఆస్తిని అమ్మిన పిమ్మట వారు మనస్సులో సాతాను ప్రవేశించుటకు ద్వారములు తెరచిరి. వారు కొంత దాచుకొని, కొంత దేవునికి సమర్పించుటకు వచ్చి అపొస్తలుల యొద్ద అబద్ధమాడి ప్రాణములు విడిచిరి. మోసపోకుడి దేవుడు వెక్కిరింపబడడు (గలతీ 6:7). పరిశుద్ధాత్ముడైన దేవుడు అటువలె ఇప్పుడు కూడ ఒకేలాగున ఉండినను (వెంటనే శిక్ష విధించిన యెడల) చాలామందికి ఆయువు తక్కువగును. కాని దేవుడు మనలను ఇంకను ప్రేమించు చున్నాడు. కాబట్టి మనము దేవునికి కానుకలు సమర్పించునప్పుడు దేవునియందు భయముతో, భక్తితో మనము ఇచ్చునది మంచిగాను, ఆనందముతోను ఇచ్చెదము. "దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (2కొరింథీ 9:7).

- సామ్యూల్ రోనీ గూటం (B.Tech), కాకినాడ.

19.

# దేవునితో నిలబడుట

## (Standing with the Lord)

మానవుడు సాంఘిక జీవి, కాలారంభమునుండి మానవుడు సమాజములో జీవించుట కిచ్ఛయించుకొన్నవాడు. జంతువులు పక్షులు కూడ గుంపులుగా నివసిస్తాయి. ప్రతి మానవుడు తన స్వజనుల మధ్య నివసించడానికి కోరుకొంటాడు.

ఒంటరిగా అరణ్యములో జీవించిన కొందరిని గూర్చి బైబిలులో మనము కనుగొనగలము. ప్రవక్తయైన ఏలియా ఎక్కువ కాలము అడవులలోనే యుండెను. దేవుడు కాకుల ద్వారా అతనికి ఆహారము పంపించుచుండెను. బాప్తిస్మమిచ్చు యోహాను ఇశ్రాయేలునకు ప్రత్యక్షమగు దినము వరకు అరణ్యములో నుండెనని మనమెరుగుదుము (లూకా 1:80). "ఈ యోహాను ఒంటె రోమముల వస్త్రమును, మొలచుట్టు తోలు దట్టియు ధరించుకొనువాడు, మిడతలును అడవి తేనెయు అతనికి ఆహారము" (మత్తయి 3:4).

తమ చుట్టుయున్న ప్రజలందరు దుష్టులును దేవునికి దూరస్థులుగ యున్న సమయంలో దేవునితో నిలిచి ఆయన నారాధించిన కొందరిని గూర్చి పాత నిబంధనలో మనము చదువగలము. ఆనాటి దుష్ట ప్రపంచములో నోవహు వేరుగా యున్నాడు. అతడొక్కడు మాత్రమే నీతిపరుడు నిందారహితుడై యుండి యెహోవా దృష్టియందు కృప పొందిన వాడాయెను (ఆది 6:8,9). జలప్రళయము ద్వారా నాటి ప్రపంచమంతా నాశనము చేయబడెను గాని, నోవహు అతని కటుంబము రక్షింపబడెను.

విగ్రహారాధికుల మధ్య అబ్రాహాము అతని కుటుంబము మాత్రమే యెహోవా దేవుని నారాధించిరి. ఫరో గృహములో యుండి దేవుని సేవించినవాడు యోసేపు ఒక్కడు మాత్రమే. కర్మెలు పర్వతము మీద బయలు దేవత యొక్కయు, అషేరా

దేవి యొక్కయు 850 ప్రవక్తలను ఎదుర్కొనుటకు ఏలియా ఒక్కడు మాత్రమే నిలబడ్డాడు (1రాజులు 18). ప్రజలందరు నెబుకద్నెజరు యొక్క బంగారు ప్రతిమకు సాగిలపడుచుండగా ముగ్గురు మాత్రమే ఆ విగ్రహము నారాధించకుండ నిలబడిరి (దానియేలు 3).

క్రొత్తనిబంధనలో కూడ ప్రభువుతో ఒంటరిగా నిలబడిన కొందరిని గూర్చి చదువగలము. యేసుప్రభువు పదిమంది కుష్ఠరోగులను శుద్ధిచేయగా వారిలో ఒక్కడు మాత్రమే కృతజ్ఞత చెల్లిస్తూ ఆయన యొద్దకు తిరిగి వచ్చాడు (లూకా 17:11-19). కైసరయ పట్టణములో అన్యజనుల మధ్య ప్రభువును సేవిస్తూ నిందారహితముగా కొర్నేలి ఒక్కడు మాత్రమే యున్నాడు (అపొ.కా. 10:1-4). వీరు తమ తమ ఫలమును పొందియున్నారు. ప్రభువుతో వారికున్న సన్నిహిత సంబంధమును బట్టి, వారి చుట్టు నున్న ప్రజలు పాపములో జీవించుచున్ననువారు ప్రభువుతో నిలబడగలిగారు.

అయితే దేవుని ప్రజల మధ్య జీవించుచుండినను పాపము చేసిన వారు కొందరుండిరి. యెహోషువ గ్రంథము 7వ అధ్యాయములో ఆకానును గూర్చి చదువగలము. ఇశ్రాయేలు సైన్యములో అతడొక సైనికుడు. యెరికోపై దేవుడు వారికి విజయాన్నిచ్చి నప్పుడతడు అక్కడ ఉన్నాడు. ఇశ్రాయేలు మధ్య దేవుడు చేసిన ఆశ్చర్య కార్యములను గూర్చి అతడెరుగును. అయినను యెరికోనుండి శపితము చేయబడిన దానిలో కొంత తీసికొని అతడు దాచిపెట్టాడు. ఆ పాపమును బట్టి అతడును, అతని కుటుంబమును రాళ్లు రువ్వి చంపబడిరి.

దైవజనుడు ఎలీషాకు గేహజీ సేవకుడుగా నుండెను. ఎలీషా ద్వారా అతడు దేవుని శక్తిని తిలకించాడు. అయినను ఎలీషా నయమాను దగ్గర నిరాకరించిన బహుమతులను తన కొరకు తెచ్చుకొని రహస్యముగా ఉంచుకొన్నాడు. అతడు ఎలీషావలన శపించబడి నయమానుకు కలిగిన కుష్ఠురోగమును పొందాడు

(2రాజులు 5). క్రొత్త నిబంధనలో ఇస్కరియోతు యూదా కనబడుచున్నాడు. అతడు యేసుతో 3½ సంవత్సరములు సాంగత్యము చేసాడు. ఆయన బోధలను విన్నాడు, చేసిన మహత్కార్యములన్నిటిని చూచాడు. అయినను ఆయనను అప్పగించి పాపము చేశాడు. చివరకు ఉరి తీసికొని చచ్చాడు. క్రీస్తు సంఘ ఆరంభ దినాల్లో క్రైస్తవులందరు ఒకే కుటుంబముగా జీవించేవారు. అపొ.కా. 5వ అధ్యాయములో అననీయ సప్పీరాలను దంపతులను గూర్చి మనము చదువ గలము. పాపము చేసినందువలన వారు తమ శిక్షను పొందారు.

ప్రజలు ప్రభువుతో యున్నను, పాపములో యున్నను తమ ఫలమును పొందియున్నట్లు చరిత్రలో మనము పదే పదే చదువగలము. నేడు కూడ ప్రజలు దేవునినుండి దూరముగ పోవుచున్నను దేవునితో నిలచి యుండువారిని మనము కనుగొలము. అట్లే దేవుని ప్రజలతో కలిసిమెలిసి జీవించుచున్నను పాపము చేయుచున్న వారిని మనము చూడగలము, నీవెక్కడ ఉన్నను ఆయన నిన్ను కనుగొంటాడు. "ఆయన చేట ఆయన చేతిలో ఉన్నది; ఆయన తన కళ్లమును బాగుగా శుభ్రము చేసి గోధుమలను కొట్టులో పోసి, ఆరని అగ్నితో పొట్టును కాల్చివేయును" (మత్తయి 3:12).

ఏలియా వలెను, బాప్తిస్మమిచ్చు యోహాను వలెను మనము అరణ్యములో జీవించాలని గాని, విగ్రహారాధకులతో కలసి జీవించాలని గాని ప్రభువు కోరుటలేదు. క్రీస్తునందలి విశ్వాసులందరు కలసి జీవించునట్లు ఆయన తన రాజ్యమైన సంఘాన్ని స్థాపించాడు. ప్రభువు పనిచేయుటకు ఏకమై ఒకరినొకరు పురికొల్పగలరు. ప్రభువు ప్రజలతో జీవించుట మాత్రమే సరిపోదు. నీకు నీవే బైబిలును చదువని యెడల సంఘములో జరుగు బైబిలు పఠనము సరిపోదు. ప్రార్థనా జీవితము నీకు లేనియెడల సంఘ ప్రార్థనలు సరిపోవు. ప్రభువుతో మన వ్యక్తిగత జీవితం బలపడాలి. అది బలముగా లేనప్పుడు దేవుని ప్రజల మధ్య జీవించుచున్నను మనము యితరులవలె పాపములో పడ్తాము. ప్రార్థన ద్వారాను, బైబిలు పఠనము

ద్వారాను, పరిచర్య ద్వారాను ప్రభువుతో మనకు గల సంబంధాన్ని బలపర్చుకొని ఆయన దృష్టిలో కృప పొందుదుము గాక !

- కవిత గూటం,
క్రీస్తు సంఘము, కాకినాడ.

# క్రీస్తు పటము
## (Picture of Christ)

మన మందరము జ్ఞానము గలవారమని ఎరుగుదుము గాని, మన జ్ఞానము మనుష్యుని ఆలోచనలను ఆధారం చేసుకొనక దేవుని జ్ఞానమును ఆధారం చేసుకొనవలెనని కోరుచున్నాను. ఎందుకనగా ఈ లోకజ్ఞానము దేవుని దృష్టికి వెర్రితనముగా యున్నది (1కొరింథీ 1:20).

ఈ అంశములో కొన్నిటిని సహోదరుడైన జెర్రి బార్‌బర్ (Jerrie Barber) వ్రాసిన గ్రంథములో నుండి అందించుచున్నాను. క్రీస్తు సామాన్య మానవునిగా వృత్తికి వడ్లవాడుగా జీవించిన వాడు (మార్కు 6:3). ఆయనను ఇస్కరియోతు యూదా, రాజును చేయనుద్దేశించి తుదకు తానే వురిపోసుకొని మృతిచెందెను.

యేసుక్రీస్తును ఈరోజుల్లో విగ్రహాలుగా, బొమ్మలుగా (పటములుగా) చూస్తు వున్నాము. మరి విగ్రహాలే విగ్రహారాధన అయతే పటములు విగ్రహారాధన కాదని నీ వుద్దేశమా ? అది సరికాదు. నీవు నీ యింటిలో యేసుక్రీస్తు ఫొటోను (పటము) వుంచుకొంటావు కాని యితర దేవతల, దేవుళ్ల పటములు వుంచుకొనవు. ఎందుకు ? అవి దయ్యాలేనని మనుష్యుల ఊహలతో చిత్రీకరించినవేనని నీవెరుగుదువు. ఆలాగే యేసుక్రీస్తు పటమును కళాకారులు వివిధ రీతులలో చిత్రీకరించిరి. నీ యింటిలో వున్న పటములు కళాకారుల కల్పనే అనే నీవు తలంచవు. యేసుక్రీస్తును గొర్రెలకాపరిగా, సిలువపై వ్రేలాడినట్లుగా, ప్రార్ధన చేయు చున్నట్లుగా, వారు చిత్రీకరించారు. అవి వారి ఊహాజనిత చిత్రాలే గాని ఆయన నిజస్వరూపము కాదు. ఇట్టివాటిని లేఖనాలు ఖండించుచున్నవి. "పైనఆకాశమందే

గాని, క్రింద భూమియందే గాని, భూమిక్రింద నీళ్లయందే గాని యుండు దేని రూపమునయినను, విగ్రహమునైనను నీవు చేసికొనకూడదు. వాటికి సాగిలపడ కూడదు, వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడైన యెహోవానగు నేను రోషము గలదేవుడను" (నిర్గ 20:4-5). "చిన్న పిల్లలారా! విగ్రహముల జోలికి పోకుండ జాగ్రత్తగా ఉండుడి" (1యోహాను 5:21). కాలం మారుతున్నట్లు విగ్రహారాధన కూడ మారింది. అవి నేడు పటములుగా మన మధ్యలో వున్నాయి. ఈ పటములను హిందువులు కొబ్బరికాయలు, అగరు బత్తులు, దండలు, పండ్లు, పిండివంటలు మరియు తీపి పదార్థాలతో ఆరాధిస్తారు. మహ్మదీయులైతే సమాధులను ఆరాధిస్తారు. వారు వాక్యాలతో నిండిన పటములకు ప్రాముఖ్యము నిస్తు వాటికి అగరుబత్తులు, సాంబ్రాణి పొగలు మొదలగునవి పెట్టి ఆరాధిస్తారు.

ఈనాటి క్రైస్తవులు క్రిస్మసు పండుగనాడు యేసుక్రీస్తు పటమునకు దండలు వేసి, అగరుబత్తులు వెలిగించి, కొవ్వొత్తుల వెలుగులతో అలంకరిస్తారు. ఇవన్ని అన్యులకు గురుతుగా అని చెప్పుతారు. మీ దేవుడు ఎవరంటే ఎలా వుంటాడు అంటే యేసుక్రీస్తు పటమును చూపుతారు. వీరు నిజ క్రైస్తవులా ? వీరు ఎప్పుడో ఒకప్పుడు సిగ్గుపడేవారే. "విగ్రహమును నిర్మించు వారందరు మాయవంటివారు. వారికిష్టమైన విగ్రహములు నిష్ప్రయోజనములు. తామే అందుకు సాక్షులు. వారు గ్రహించువారు కారు, ఎరుగువారు కారు గనుక వారు సిగ్గుపడరు. ఎందుకును పనికిరాని విగ్రహమును పోతపోసి దానినొక దేవునిగా నిరూపించువాడెవడు ? ఇదిగో దానిని పూజించు వారందరు సిగ్గుపడుదురు. ఆ శిల్పకారులు నరమాత్రులే కారా ? (యెషయా 44:9-20). గనుక బైబిలు విగ్రహారాధనను ఖండించుచున్నది.

యేసుక్రీస్తును గూర్చి యెషయా ఇలా వ్రాయుచున్నాడు: "లేత మొక్క వలెను, ఎండిన భూమిలో మొలచిన మొక్కవలెను అతడు ఆయన యెదుట పెరిగెను. అతనికి సురూపమైనను, సొగసైనను లేదు. మనమతనిని చూచి ఆపేక్షించునట్లుగా అతని యందు సురూపమే లేదు (యెషయా 53:2). యేసుక్రీస్తు ఆకారమును గూర్చి ఆధారాలు లేవు. ఒకవేళ కొందరు అబద్ధాలు చెప్పి నమ్మించ

వచ్చును. కాని బైబిలు అబద్ధ బోధలను, సిద్ధాంతాలను ఖండించుచున్నది. కావున ఆయనను ప్రేమించువారు ఆయన మాటలు విని నడుచుకొనుట ద్వారా ఆయనను పోలియుండాలి. అప్పుడు దేవుని పిల్లలుగా వుండగలము (1యోహా 3:2).

క్రీస్తు సంఘ సభ్యులు ఇంకా క్రీస్తు పటమును పెట్టుకొన్నట్లయితే త్వరగా దానిని తీసిపారవేయవలెనని కోరుచున్నాను. అట్లు మీరు చేసినచో నిజక్రైస్తవులవలె వుందురు. లేదా లేఖనాల ద్వారా ఖండించ బడవలసివచ్చును.

క్రైస్తవులు అన్ని తినవచ్చునని అంటారు. దానిని లేఖనాలు నిరూపించు చున్నవి. అపొ.కా. 10:12-15 లేఖనాలు "కాబట్టి నా ప్రియులారా విగ్రహారాధనకు దూరముగా పారిపొండి. బుద్ధిమంతులతో మాటలాడినట్లు మీతో మాటలాడు చున్నాను. నేను చెప్పు సంగతి మీరే ఆలోచించుడి. మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయే కదా ? ..... మీరు ప్రభువు పాత్రలోనిది దయ్యముల పాత్రలోనిది కూడ త్రాగనేరరు. ప్రభువు బల్లమీద వున్న దానిలోను దయ్యముల బల్లమీద ఉన్న దానిలోను కూడ పాలుపొంద నేరరు" (1కొరింథీ 10:14-22). నిజ క్రైస్తవులు కానివారు అన్ని తింటారు. కాని నిజక్రైస్తవులు విగ్రహారాధనకు సంబంధించిన పదార్థాలు తినకూడదు. "భోజనమును బట్టి దేవుని యెదుట మనము మెప్పుపొందము తినకపోయినందున మనకు తక్కువలేదు, తిననందున మనకు ఎక్కువ లేదు. అయినను మీకు కలిగియున్న స్వాతంత్ర్యము వలన బలహీనులకు అభ్యంతరము కలుగకుండ చూచుకొనుడి" (1కొరింథీ 8:8-10; 1కొరింథీ 10:27:33).

కావున మిత్రుడా క్రీస్తు రూపము అని చెప్పబడుచున్న పటము ఏదైనా నీ యింటిలో వుంటే ఆ పటమును దాని ఆరాధనను తొలగించు. లేఖానుసారమైన బాప్తిస్మం పొంది క్రీస్తును ఆరాధించి అంతము వరకు నమ్మకంగా జీవించు. అప్పుడే నీకు జీవకిరీటం దొరుకుతుంది.

- జే. దేవానంద్, హైద్రాబాద్.

సంక్షిప్త ప్రసంగము

# దేవుని రాజ్యము

(కీర్తన 145:8-13)

## పరిచయము :

రాజ్యము అనుమాట 'బేసిలేయియా' అను గ్రీకు పదమునుండి వచ్చినది. రాజరికము, రాజాధికారము, ప్రభుత్వము అను అర్థము దానికి కలదు. దైవ పరిపాలనయే దేవుని రాజ్యము, తరతరములకు మానవ హృదయాల్లో ఈ పాలన జరుగును (కీర్త 145:13). రాజ్యము యొక్క కొన్ని లక్షణములను గమనిద్దాం :

## 1. దానిలో ప్రవేశించుట కష్టము :

ఎ. అపొ.కా. 14:21,22

బి. అంతకుముందు సంభవించిన సంఘటనలనుబట్టి పౌలు అట్లు చెప్పాడు - అపొ.కా. 14:19.

సి. దేవుడు మన హృదయాలను ఏలునప్పుడు కష్టములు సంభవింప వచ్చు. యోహాను 15:18-20.

## 2. అదొక విమోచన :

ఎ. గలతీ 1:3-4; కొలస్స 1:13,14.

బి. మత్తయి 9:35.

సి. యేసు మనలను భౌతికంగానే కాదు, ఆత్మీయంగా విమోచించారు.

## 3. మనమే ఆరాజ్యము :

ఎ. ప్రకటన 1:6-9.

బి. మనకీయబడిన గొప్ప విశ్వాసమును, ఘనతను కొన్నిసార్లు మరతుము.

సి. మనము దేవుని ప్రజలము ! దేవుని రాజ్యమైనవారము ! దేవుడు స్థాపించిన రాజ్యము ! క్రీస్తు దానికొరకై తన ప్రాణము పెట్టిన రాజ్యము.

## 4. దానిని తప్పించుకొనలేము :

ఎ. ఫిలిప్పీ 2:9-11.

బి. చివరకు ప్రతివాడు యేసును ఒప్పుకొనును. అయితే దానినిబట్టి రాజ్యములో యున్నవారు సంతోషింతురు (ప్రక 7:11-17).

5. అది అదృశ్యమైనది :

ఎ. యోహాను 18:36.

బి. మానవుని హృదయమే దేవుని రాజ్యస్థలము.

సి. లూకా 17:20-21. దేవుడు మాత్రమే హృదయ తలంపుల నెరుగును. అదే నిజమైన రాజ్యస్థలము.

**ముగింపు :**

మానవ హృదయాల్లో తరతరములకు జరుగు పరిపాలన దేవుని రాజ్యము. దానిలో ప్రవేశించుట కష్టము, ఆయన సంఘమైన మనమే ఆరాజ్యము. దానిని తప్పించుకొనలేము, అది అదృశ్యమైనది.

- ఎడ్ కర్క్ పేట్రిక్.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/99

From :
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001.

To

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : Joshua Gootam